తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

30 ఏళ్ళ ప్రస్థానం
వార్త
వార్షికోత్సవం
1996 - 2026

# చంద్రప్రభపై సప్తగిరీశుడు



తిరుమల, అక్టోబర్ 18 ప్రభాతవార్తప్రతినిధి:

తనను శరణుజొచ్చిన వారిని కటాక్షించి కోరిన కోర్కెలు తీర్చే చల్లనిదేవుడు శ్రీనివాసుడు నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి చంద్రప్రభవాహనంపై భక్తులను కరుణించాడు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన మలయప్పస్వామి రాత్రి చంద్రప్రభతోకూడిన వాహనంపై విహరించాడు. చల్లనిదేవరప్రభతో మలయప్పస్వామిభక్తులకు దర్శనమిచ్చాడు. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రకాంతుమణులు స్రవిస్తాయి. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు పాల్గొన్నారు.

## సూర్యప్రభపై మలయప్ప దివ్యదర్శనం



నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సూర్యమండల మధ్యవర్తిగా వెలుగొందుతున్న స్వామివారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీదుర్గామాతకు పాలకలశాలు సమర్పణ

వి.కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త



వి.కోట పట్టణంలోని శ్రీ దుర్గామాత ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ఆలయ కమిటీ అధ్వర్యంలో 355 మహిళలతో అమ్మవారికి పాలకలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఈ శోభాయాత్ర స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మొదలై లాంగ్ బజారు మీదుగా అమ్మవారి ఆలయం వరకు నిర్వహించారు. పురోహితులు భాస్కర్ శర్మ అధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు అన్నదాన ం జరిపారు. దుర్గామాత ఆలయ చరిత్ర పుస్తకాన్ని కార్పోరేషన్ డైరెక్టర్ రంగనాథ్ ఆవిష్కరించారు.సిఐ సోమశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో గట్టి బందోబస్తు చేప ట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రఘుపతినాయుడు, సహధర ్మకర్తలు కృష్ణారెడ్డి,నరసింహారెడ్డి, మాజీధర్మకర్తలు దామోదర్‌రెడ్డి, సుబ్రమణ్యంరాజు,సభ్యులుతుకారాం,జనార్ధన్‌నాయుడు,రమేష్

# కుప్పలు తెప్పలుగా నామినేషన్లు



చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :

చిత్తూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాకలకు ఆదివారం ఆఖరి రోజు కావడంతో చిత్తూరు మేయర్, కుప్పం, పలమనేరు, నగరి మున్సిపల్ చైర్మన్ స్థానాలకు, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. చిత్తూరు మున్సిపల్ మేయర్ స్థానానికి మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే 60 డివిజన్ స్థానాలకు 606 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే కుప్పం మున్సిపల్ చైర్మన్ కుర్చీకి 18 నామినేషన్లు దాఖలు కాగా అందులో తెలుగుదేశం 6, వైకాపా 8, కాంగ్రెస్ 1, బి ఎస్ పి 1, ఇండిపెండెంట్ లు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే 32 కౌన్సిలర్ స్థానాలకు 282 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో టిడిపి తరపున 146 మంది అభ్యర్థులు, వైకాపా తరపున 49 మంది, జనసేన తరపున 13, బిజెపి 2, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే పలమనేరు మున్సిపల్ చైర్మన్ గిరికి 7 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో తెలుగుదేశం తరఫున మూడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మూడు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 36 వార్డులకు 150 నామినేషన్లు దాఖలు అయ్యాయి. తెలుగుదేశం 69, వైకాపా 62, జనసేన 6, బిజెపి 3, ఇండిపెండెంట్ లు 6, ఇతర అభ్యర్థులు మూడు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే నగరి మున్సిపల్ చైర్మన్ పదవికి 14 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో తెలుగుదేశం తరపున 3, వైయస్సార్ కాంగ్రెస్ తరపున 10, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే నగరి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 46 వార్డులకు 283 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో తెలుగుదేశం తరఫున 121, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 130, జనసేన 3, బిజెపి 6, ఇండిపెండెంట్ 19, కాంగ్రెస్ 1, బి ఎస్ పి 1, సిపిఐ తరఫున ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

## మూడో రోజు మేయర్ స్థానానికి 24, కార్పొరేటర్ స్థానానికి 177 నామినేషన్లు



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో మూడవ రోజు ఆదివారం నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగిందని కమీషనర్ ఎం.జయకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో మూడవ రోజు మేయర్ స్థానానికి 24, కార్పొరేటర్ స్థానానికి 177 మొత్తం 201 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మేయర్ స్థానానికి 24 నామినేషన్లు దాఖలు కాగా, అందులో తెలుగుదేశం 5, వైసిపి 2, సిపిఎం2, సిపిఐ 1, కాంగ్రెస్ 1, ఆమ్ ఆద్మీ పార్టీ 1, బిసివైపి 2, బిఎస్‌పి 2, ఇండిపెండెంట్లు 8, మంది నామినేషన్లు దాఖలు అయ్యాయని తెలిపారు. అదే విధంగా తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లకు సంబంధించి కార్పొరేటర్ స్థానాలకు 177 మంది నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో తెలుగుదేశం 76, వైఎస్ఆర్‌సిపి 8, జనసేన 45, బిజెపి 7, సిపిఎం 2, సిపిఐ 2, ఇం డిపెండెంట్స్ 36, ఇతరులు 1, మొత్తం 177 నామినేషన్లు అందాయన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పక్కా చర్యలు

**జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు- సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లో అదనపు భద్రత ఏర్పాట్లు**

**స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు సిఎండి ఎల్ శివకుమార్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు**

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:

స్థానిక ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించిన పరిశీలకులు సిఎండి ఎల్ శివశంకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఎఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు సిఎండి ఎల్ శివకుమార్ ఆదివారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు శివశంకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో వీడియో చిత్రీకరణతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిం చాలని, అర్హత కల్గిన ప్రతి ఒటరుకు



ఓటు హక్కు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపాల్టీలకు సంబంధించి 168 వార్డుల్లో ఈ నెల 28వ తేదీన పోలింగ్, 30వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి మొదటి విడత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఈ నెల 23 నుండి 25వ తేదీలోపు 2వ విడత శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలపై ప్రజల నుండి ఫిర్యా దులు స్వీకరించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడానికి పక డ్బందీ ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పెట్టెలు, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ, రవాణా, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 4 రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు, 622 గ్రామ పంచాయతీలు వుండగా 370 ఎంపిటీసీ స్థానాలు, 27 జడ్పీటీసీ స్థానాలు వున్నాయని, జిల్లాలో గ్రామీణ ప్రాంత జనాభా 12,90,810 కాగా మొత్తం ఓటర్ల సంఖ్య 10,26,821 మంది వున్నారన్నారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లతో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం వున్న వారిని గుర్తించి కొంతమందిపై బైండోవర్ కేసులు పెట్టామని, సుమారు 2 వేల మంది పోలీసు సిబ్బందితో భద్రత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌బాబు, డిఎల్‌డిఎ రవి, డిఆర్‌డిఎ ఎపిడి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలే
# కూటమి ప్రభుత్వ లక్ష్యం
### -టిడిపి నేతలు



తిరుపతి,అక్టోబర్ 18 ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా ప్రజాస్వామ్య బద్ధమైన వాతావరణాన్ని కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పార్లమెంట్ అద్యక్షురాలు పనబాక లక్ష్మి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో మొదటి రెండు రోజుల్లో మేయర్ అభ్యర్థులు, కార్పొరేటర్ అభ్యర్థులు కలిపి మొత్తం 273 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు. ఈ గణాంకాలే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నామనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు మానుకుని, అర్హులైన అభ్యర్థులందరూ నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సి.దివాకర్ రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ నుకసాని బాలాజీ పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఎంపికలో
# ఇరు పార్టీలు ముమ్మర కసరత్తు..



తడ అక్టోబర్ 18, ప్రభాతవార్త:

మండలం పరిధిలోని 18పంచాయతీలకు గాను సుమారుగా 39 వేల పైచిలుకు ఓట్లు ఉండగా 13 ఎంపీటీసీ స్థానాలు 18 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించవలసి ఉంది మొదటగా ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడినప్పటి నుండి గ్రామాలలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది ప్ర ధాన పార్టీలైన తెలుగుదేశం పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ బలాన్ని నిరూపించేం దుకు బలమైన అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించారు.ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశా వాహులు తాకిడి ఎక్కువైంది తమ అదృష్టా పరీక్షి ంచుకునేందుకు పావులు కదుపుతున్నారు ప్రధానంగా ఎంపీపీ, జడ్పిటిసి స్థానం కైవసం వేసుకునేందుకు ఇరుపార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. అభ్య ర్థుల ఎంపిక ప్రధాన పార్టీల నాయకులకు సవాల్ గా మారింది నాయకులు పలుమార్లు చర్చలు జరిపి అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తయినప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల బల బలాలు కుల సమీకరణా అనుగుణంగా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. కూటమి పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా కొన్ని ఎంపీటీసీ స్థానాలు భారతీయ జనతా పార్టీకి కేటాయించే అవకాశం ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో అభ్యర్థులను పోటీలో దించేందుకు అభ్యర్థులను ఎంపిక చేస్తు న్నారు. సమయం

## వైసిపి చైర్మన్ అభ్యర్థిగా
# జయప్రకాశ్ నామినేషన్ దాఖలు



పుత్తూరు, అక్టోబరు 18 ప్రభాతవార్త :

స్థానిక సంస్థ ఎన్నికల్లో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఛైర్మన్ అభ్యర్థిగా మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు ఏకాంబరం, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ డి.శంకర్‌లు ఇద్దరూ వైసిపి తరపున ఛైర్మన్ అభ్యర్థులుగా ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారు. ఆ మేరకు వైసిపి తరపున ఇప్పటి వరకూ 3గురు ఛైర్మన్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.అయితే ఛైర్మన్ అభ్యర్థిగా జయప్రకాశ్ పేరు ఖరారయ్యే అవకాశం వుంది.

## నాపై దౌర్జన్యం చేయడం అన్యాయం : జయప్రకాశ్ ఆవేదన



*పుత్తూరు, అక్టోబరు 18 ప్రభాతవార్త :*

*సుదీర్ఘ రాజకీయాల్లో ఎవరికీ హాని తలపెట్టని తనపై దౌర్జన్యానికి దిగడం అన్యాయమని మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో వైసిపి ఛైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన డి.జయప్రకాశ్ (చిట్టి) ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఛైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వెళ్లిన తనపై ప్రత్యర్థి వర్గం దాడి చేసి తన చేతిలోని నామినేషన్ పత్రాలను చింపేశారని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఒక వీడియో విడుదల చేశారు. 2002లోనే తాను పుత్తూరు మండల జడ్పీటిసి అభ్యర్థిగా గెలిచానని తెలిపారు. గత మునిసిపల్ ఎన్నికల్లో గెలిచి వైస్‌ఛైర్మన్‌గా ప్రజా సేవ చేశానని తెలిపారు. అప్పటి నుంచి సుమారు 25 సంవత్సరాల పాటు రాజకీయాల్లో వున్న తాను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే రాజకీయాలు చేశానన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి ఛైర్మన్ అభ్యర్థిగా తాను నామినేషన్ వేయడానికి వెళుతుండగా తనపై ప్రత్యర్థి వర్గం దాడి చేయడం పట్ల తీవ్ర మనోవేదనకు గురైనట్టు తెలిపారు. నామినేషన్ వేయడానికి ముందు కూడా వెనుకబడిన తరగతికి చెందిన తనకు కులధృవీకరణ పత్రం ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెట్టారన్నారు. ప్రశాంతతకు నిలయంగా వుండే పుత్తూరు ఇటువంటి సంఘటనలు దురదృష్టకరమని జరగనున్న ఎన్నికల్లోనైనా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రత్యర్థి వర్గం వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.*

## శ్రీ చెంగాళమ్మకు
# శ్రీ దుర్గా దేవి అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ మాత పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి ఆదివారం శ్రీ దుర్గాదేవి అలంకారాన్ని చేసి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.ప్రత్యేక అలంకారానికి నెల్లూరుకు చెందిన గంగిశెట్టి సాయికుమార్, దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో నిర్వహించిన చండీయాగానికి దబ్బల శ్రీమంత్ రెడ్డి, హారిక దంపతులు ఉభయకర్తల వ్యవహరించారు. అలాగే సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గురు పీజీ సరిత కళ్యాణ్, స్టూడెంట్స్ అంతరిక్ష సెంటర్ సూళ్లూరుపేట వారిచే సంగీత నృత్య ప్రదర్శనలు, చెన్నై వారిచే శాస్త్రీయ సంగీత నృత్య ప్రదర్శన, సాయి హేమంత్ కృష్ణన్ నెల్లూరు వారిచే ముక్కుతో ఫ్లూట్ వాయిద్యం భక్తులను అలరించాయి. అమ్మవారికి ఆనవాయితీగా సమర్పించే సారెలలో భాగంగా సాయి నగర్, మహదేవయ్య నగర్, సరసమ్మ కట్ట, జాన్సీ నగర్, సంజీవయ్య నగర్, ఇందిరా నగర్‌ల నుంచి మేళతాళాలతో అంగరంగ వైభవంగా భక్తి పూర్వకంగా అమ్మవారికి సారెను సమర్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో జరిగాయి.

# భాండాసురవధ మహాగౌరీ అలంకారం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

ఆదివారం దుర్గాష్టమి రావడంతో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ఆలయాలు కిటకిటలాడాయి. ఆదివారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమ్మవారికి భాండాసుర వధ ఉత్సవాన్ని నిర్వహించారు. మహాగౌరి దేవి అలంకారంలో అమ్మవారిని ఆకట్టుకొనేరీతిలో ముస్తాబు చేసి ఉత్సవం నిర్వహించారు. కాగా, కనకాచలంపై వెలసిన దుర్గమ్మఆలయంలో ఆదివారం అష్టమి సందర్భంగా మూల విరాట్టుకు సరస్వతీ అలంకారం నిర్వహించారు. ఉభయదారులుగా

## -అష్టమితో ఆలయాలు కిటకిట

శ్రీకాళహస్తీశ్వరాలయంలో తీగల కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆర్. సదాశివయ్య కుటుంబ సభ్యులు హాజరై ప్రాకార ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని చక్కగా అలకరించి ప్రాకార ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు కోలా వైశాలి, అర్చకులు కరుణాకర్ గురుకుల్ పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, ఏఇఓ విద్యాసాగర్‌రెడ్డిలు పర్యవేక్షించారు.

**ఆలయాలు కిటకిటః**

ఆదివారం అష్టమి రావడంతో ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం, కనకాచలం, ముత్యాలమ్మ, ఏడు గంగమ్మల ఆలయం, దక్షిణ కాళీమాత, కొత్తపేటలోని శీతాలాంబ ఆలయాల్లో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. క్రిష్ణరెడ్డి మండపంలో శ్రీకాళహస్తీశ్వరాలయం ఏర్పాటు చేసిన అమ్మవాంరి విగ్రహం వద్ద వచ్చిన భక్తులకు దర్శనం చేసుకోవడంతో పాటు దేవస్థానం తరుపున ఉచిత ప్రసాదాలను



అందించారు. వివిధ ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కాగా, కనకాచలంపై మహిళా భక్తులు మొుకక్కులు తీర్చుకొనుటకు చక్కటి ఏర్పాట్లు, దీపాలు వెలగించుటకు చక్కటి స్థలాన్ని ఏర్పాటు చేశారు.

# తిరుపతి డివిజన్

## భావోద్వేగ ప్రేమకథగా ప్రేమ డైరీలో చివరి పేజీలు..

### త్వరలో విడుదలకు సిద్ధం.. అర్జున్ యాదవ్, అదితి జంటగా చిత్రం..



**తిరుపతి కల్చరల్ అక్టోబర్ 18 ప్రభాత వార్త..**

తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు మరో ప్రేమ కథా చిత్రం సిద్ధమవుతోంది. శ్రీ ప్రసన్న హనుమాన్ వెంకటేశ్వర ప్రొడక్షన్స్ పతాకంపై పి.వి. నరసింహ యాదవ్ నిర్మిస్తున్న ప్రేమ డైరీలో చివరి పేజీలు చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు ముస్తాబవుతోంది.హరికృష్ణ పామంజి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పి.వి. అర్జున్ యాదవ్, అదితి జంటగా నటించారు. హీరోగా అర్జున్ యాదవ్‌కు ఇది తొలి చిత్రం.ప్రేమ, విరహం, భావోద్వేగాలతో కూడిన కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలోని పాటలను స్థానిక గేట్ కళాశాలలో మ్యాంగో మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. సంగీత దర్శకుడు అర్మాన్ మెరుగు స్వరపరిచిన గీతాలు సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయని చిత్రబృందం తెలిపింది. తేజ .ఎ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను హరికృష్ణ పామంజి నిర్వహించారు. సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. కృష్ణ ప్రసాద్ (కేపీ) ప్రజాసంబంధాల అధికారిగా వ్యవహరిస్తున్నారు.

## మార్చి 31న ఏకవీర సేవా ఫౌండేషన్

### ఉచిత సామూహిక వివాహ మహోత్సవం



**తిరుపతి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

పేద, మధ్యతరగతి కుటుం బాలకు ఆర్థిక భారం గాకుం డా హిందూ సంప్రదాయాల ప్రకారం తమ పిల్లల వివాహా లను వైభవంగా నిర్వహించు కోవాలనే సత్సంకల్పం తో ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలోఉచిత సామూహి క వివాహ మహోత్సవం నిర్వహించనుంది. 2027 మార్చి 31వతేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు తిరుపతి తిరుచానూరులో నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ ప్రాంగణంలో ఈ సామూహిక వివాహ మహోత్సవాన్ని జరిపించనున్నారు. ఇందుకు ఆదివారం పోస్టర్‌లను ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి ,రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కే ఎన్ రాజా, సభ్యులు చిత్రపు హనుమంతరావు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి రామకృష్ణ మొదలియార్‌తో కలసి ఆవిష్కరించారు. 516 జంటలకు ఉచిత సామూహిక వివాహ మహోత్సవం – 2027 నిర్వహించి తమ సేవానిరతిని చాటుకోనున్నారు .నూతన వధూవరులు వైవాహిక జీవితంలోకి ఆనందంగా అడుగుపెట్టేలా చేయాలనే ఉద్దేశంతో ఏకవీర సేవా ఫౌండేషన్ ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో ఎంపికైన వధూవరులకు వివాహానికి అవసరమైన వస్త్రాలు, ఇతర సామగ్రిని పూర్తిగా ఉచితంగా అందజేయడంతో బాటు, సంప్రదాయబద్ధమైన వైదిక పద్ధతిలో వివాహాలు నిర్వహించనున్నారు. పాల్గొనదలచిన వధూవరులు నిర్దేశిత దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపి, అవసరమైన పత్రాలతో 9533357997 నంబర్‌కు సంప్రదించాలని ప్రతాప్ తెలిపారు.

## సాహితీవేత్త విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతి



**తిరుపతి,అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

తిరుపతి రాములవారి దక్షి ణ మాడ వీధిలోని చిగోరాఆ ధ్యాత్మిక సేవా కేంద్రం లో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతి వేడుకలు జరిగాయి. సామా న్యమైన వ్యక్తిగా జీవించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కవులలో ఒకరుగా వెలుగొందిన విశ్వనాథ సత్యనారాయణ జీవిత కథను నేటి పాఠ్యాంశాలలో చేర్చవలసి న అవసరం ఎంతైనా ఉందని చి గో రా ఆధ్యాత్మిక సేవా కేంద్రం సభ్యుడు,బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ జీబీ నెంబర్ సిఆర్కే శేషగిరిరావు. సీనియర్ అసిస్టెంట్ పిఆర్ఎల్ కుమార్, ఆఫీస్ అసిస్టెంట్ డి లీలావతి. రాయలసీమ రంగస్థల కళాకారుల అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి,సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## నేడు పోలీస్ పిజిఆర్ఎస్ రద్దు



**తిరుపతి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ దృష్ట్యా సోమవారం తిరుపతి జిల్లాలో జరగాల్సిన పిజిఆర్ఎస్ రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి ప్రజలు రావద్దని సూచించారు.

## తప్పుడు కేసులతో భయపెట్టలేరు: సామకోటి

**చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 18ప్రభాతవార్త:**



తప్పుడు కేసులు, బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరని మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేకే టీడీపీ నాయకులు తప్పుడు కేసులతో వేధిస్తున్నారని విమర్శించారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని గెలుచుకోవడమే లక్ష్యమన్నారు. వైసీపీ అభ్యర్థులు ధైర్యంగా నామినేషన్లు దాఖలు చేయాలని, బెయిల్‌పై బయటకు వచ్చి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజల మద్దతుతో స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## మహాగౌరి అలంకరణలో అష్టమ దుర్గ

### వైభవంగా "శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి" నవరాత్రి ఉత్సవాలు



**చంద్రగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

మహాగౌరి అలంకరణలో అష్టమ దుర్గ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల వరకు అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మహాగౌరి హోమం, చ ండి హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణతో

## దుర్గాదేవి అలంకరణలో ఏకవీర దేవి

**రామచంద్రాపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**



సూరావారిపల్లి సమీపంలోని సురభి గోసంరక్షణశాలలో ఆదివారం దుర్గాదేవి అలంకరణలో ఏకవీరదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అమ్మవారికి వివిధ రకాల సుగంధపరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలు, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ధునిపూజ గోపూజ, దుర్గామాత కరుణాకటాక్షాల కోసం మహామంగళహారతులిచ్చారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## వైభవంగా శ్రీ మాతమ్మ తల్లి కొలుపు

### జాతర నిర్వహణకు కాపిరెడ్డి నాదమునిరెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం

**రేణిగుంట, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని తిమ్మయ్యగుంట గ్రామంలో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీమాతమ్మ తల్లి కొలుపు (జాతర) ఆదివారం అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియగా, అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజలు, మొక్కుబడుల సమర్పణతో జాతర ప్రాంగణం భక్తిపారవశ్యంతో కళకళలాడింది.గ్రామదేవతగా పూజలందుకుంటున్న శ్రీ మాతమ్మ తల్లిని దర్శించుకుని, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారికి అంబళ్లు పొంగించి, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. మొక్కుబడులు చెల్లించుకుంటూ అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. భక్తుల రాకతో తిమ్మయ్యగుంట గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వెంకటాపురం గ్రామ కమిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపిరెడ్డి నాదమునిరెడ్డి శ్రీ మాతమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని ప్రార్థించారు. అనంతరం జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులకు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.దైవభక్తితో పాటు గ్రామ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల తనకున్న అభిమానాన్ని నాదమునిరెడ్డి చాటుకున్నారు. గ్రామదేవత ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, గ్రామ ప్రజల మధ్య ఐక్యతను, పరస్పర సాన్నిహిత్యాన్ని బలోపేతం చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి ధార్మిక కార్యక్రమాలకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా జాతర నిర్వహణకు సహకరించడం అభినందనీయమని గ్రామస్తులు అన్నారు.

## కేవీబీపురం రాజకీయాల్లో ఉత్కంఠ..!

### టీడీపీ వర్సెస్ వైసీపీ...ఎంపీపీ పీఠం ఎవరి సొంతం..?

**కేవీబీపురం, అక్టోబరు 18 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలంలో ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ, వైసీపీ పార్టీ ఆధిపత్య పోరు రసవత్తరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో ఇరు పార్టీల నాయకులు తమ తమ వ్యూహాలకు పదును పెడుతున్నారా...? మండల రాజకీయాల్లో పై చేయి సాధించేది ఎవరు..? అన్నప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చినీయాంశంగామారుతున్నాయి. ఎంపీపీ పదవిని దక్కించుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఇరు పార్టీల్లో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం దక్కుతుందా...లేక రాజకీయంగా బలమైన నేతల నిర్ణయాలకే పెద్దపీట వేస్తారా...? అన్నది వైసీపీలో ఆసక్తికరంగా మారింది. మరో వైపు టీడీపీ కూడా ఎంపీపీ పీఠాన్ని దక్కించుకునేందుకు ఎలాంటి వ్యూహంతో ముందుకు సాగుతుందన్నది ఉత్కంఠ రేపుతోంది. వైసీపీ తరపున ఎంపీపీ పదవికి కాట్రపల్లి గ్రామానికి చెందిన లోకేష్, కలత్తూరు గ్రామానికి చెందిన ఆరువేలు, పెంచులయ్య పేర్లు ఆశావహులుగా వినిపిస్తున్నాయి. జడ్పీటీసీపదవికి ఆరె ధనంజయలురెడ్డి, పాతపాళెం నుంచి హరిబాబు, ఎస్ఎల్ పురం నుంచి రమణ, కేవీబీపురం నుంచి గిరిబాబు, దేవుళ్ల మణి, పేర్లు తెరపైకి వచ్చాయి. వీరిలో పార్టీ నాయకత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుంది...? అభ్యర్థుల ఎంపికలో స్థానిక రాజకీయ సమీకరణాలు ఏ మేరకు ప్రభావం చూపుతాయి అన్నది వేచిచూడాలి. టీడీపీ తరపున ఎంపీపీ పదవికి కలత్తూరు నుంచి వెట్టి దొరై, వగత్తూరు నుంచి రమేష్, కలత్తూరు నుంచి థామస్, రాయపేడు నుంచి మాధవ్ ఆశావహులుగా ఉన్నారు. జడ్పీటీసీ పదవికి కేవీబీపురంనుంచి కంధస్వామి, కేవీబీపురం నుంచి కరపరెడ్డి బాలు, వేములపూడినుంచి మునిశేఖర్ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక, స్థానిక నేతల మద్దతు, ఎన్నికల సమయంలో అనుసరించే వ్యూహాలు ఇరు పార్టీల భవిష్యత్ అవకాశాలను ప్రభావితం చేయనున్నాయి.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 3 వేల మందికి భక్తులకు అన్నదానం

### 18 ఏళ్లుగా నిరంతర సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న టీటీడీ జేఏసీ..

**తిరుపతి విద్య, అక్టోబర్ 18 ప్రభాతవార్త**



శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అలిపిరి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3,000 మందికి పైగా శ్రీవారి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. గత 18 సంవత్సరాలుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులకు సేవలందించడం విశేషం.టీటీడీ జేఏసీ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, వైద్యులు, దాతలు పాల్గొన్నారు. భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి, కోశాధికారి వెంకటరత్నం, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భరత్, హృద్రోగ నిపుణుడు డాక్టర్ వరుణ్, సుబ్రమణ్యం రెడ్డి, డాక్టర్ బెల్లం ప్రసాద్, జేఏసీ నాయకులు అరుణ్, గజేంద్ర, క్రాంతి, వెంకటముని, ఉద్యోగుల బ్యాంకు డైరెక్టర్లు కిషోర్, చీరల కిరణ్, రవికుమార్, భుట్టో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 18 ఏళ్లుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం భక్తి, సేవాభావం, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ శ్రీవారి భక్తులకు తమ వంతు సేవలందిస్తామని తెలిపారు.కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, దాతలు, స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ టీటీడీ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## పావై ఫౌండేషన్‌లో చిన్నారులతో ప్రేరణ హెల్పింగ్ సొసైటీ సందడి..

### కథలు, హాస్యం, ధాండియా నృత్యాలతో పిల్లల్లో ఆనందోత్సాహాలు..

**తిరుపతి విద్య, అక్టోబర్ 18 ప్రభాతవార్త**



ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని పావై ఫౌండేషన్‌లో చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కథలు, హాస్యం, ధాండియా నృత్యాలతో పిల్లల్లో ఆనందోత్సాహాలు నింపారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆత్మీయంగా గడుపుతూ వారిలో సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు అవసరమైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు అందజేశారు.తిరుపతికి చెందిన ప్రముఖ కథకురాలు నలంద నిర్వహించిన కథా కార్యక్రమం పిల్లల్లో ఊహాశక్తి,సృజనాత్మకతను పెంపొందించింది. ప్రేరణ సభ్యుడు దిలీప్ మహాసముద్రం నీతి కథల ఆధారంగా హాస్య కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులను నవ్వించారు. అనంతరం పిల్లలు, ప్రేరణ సభ్యులు కలిసి ధాండియా నృత్యంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.పిల్లల అవసరాల కోసం ప్రేరణ తరఫున 20 పడకలు, 20 దిండ్లు, 30 బెడ్‌షీట్లు, 30 దిండు కవర్లను అందజేశారు.కార్యక్రమానికి సహకరించిన పావై ఫౌండేషన్ సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.2007 ఆగస్టు 15న ప్రారంభమైన ప్రేరణ హెల్పింగ్ సొసైటీ గత 19 ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవలందిస్తోంది.వస్తువులను అందించడంతో పాటు ఆత్మీయతను పంచుకుంటూ పిల్లలకు మధురమైన జ్ఞాపకాలను అందించడమే తమ లక్ష్యమని సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్, సింధు, నలంద తదితర ప్రేరణ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



ఈ నెల 30న జరగనున్న తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్ర ఏర్పాట్లను నగరపాలక కమిషనర్ జయకృష్ణ ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. 30న జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం గుర్తించిన గదులను, కౌంటింగ్ సామాగ్రిని, ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి వార్డుకు కేటాయించిన టేబుల్స్, వార్డు నెంబర్, పీఎస్ నెంబర్‌లతో నేలపై వేసిన మార్కింగ్‌లు, భద్రత కోసం ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లు, ఫెన్సింగ్‌లను పరిశీలించారు. కౌంటింగ్ రోజున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, సర్వేయర్ గురువారెడ్డి, డీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జనరల్ అబ్జర్వర్



**తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ లో భాగంగా 3వ రోజు నామి నేషన్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ ఎం.వరప్రసాద్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు.ఈ సంద ర్భంగా నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లను, నామినేషన్ దాఖ లు ప్రక్రియను, భద్రతా ఏర్పాట్లను, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాలకు సంబంధించి కమిషనర్ ఎం.జయకృష్ణ వివరించారు.

**అబ్జర్వర్ తనిఖీ చేసిన కేంద్రాలు:**

న్యూ మారుతి నగర్ 22వ వార్డు నామినేషన్ కేంద్రం, కెనడి నగర్ 12వ వార్డు నామినేషన్ కేంద్రం, రైల్వే కాలనీ 35వ వార్డు నామినేషన్ కేంద్రం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, 10వ వార్డు నామినేషన్ కేంద్రం, జీవకోన, సత్యనారాయణపురం 49, 50 వ వార్డుల నామినేషన్ కేంద్రాలు, తిరుమల రెడ్డి నగర్ 1వ వార్డు నామినేషన్ కేంద్రం, నగరపాలక సంస్థ మేయర్ నామినేషన్ కేంద్రాలను అబ్జర్వర్ తనిఖీచేశారు. ఆయన వెంట అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, లైజనింగ్ ఆఫీసర్ రాజు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా అఖండ రామనామ సంకీర్తన

### 24 గంటల పాటు మార్మోగిన రామనామ స్మరణ

**పులిచెర్ల, కార్పొరేషన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త**



మండలం కావేటిగారిపల్లి గ్రామంలో అఖండ రామకోటి సంకీర్తన మహా యజ్ఞం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం వరకు 24 గంటల పాటు నిర్విరామంగా కొనసాగింది. బంగారు పాక్యం మండలం జె.కొత్తూరుకు చెందిన శ్రీమతి సుమతి కోదండ రామస్వామి ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల రామనామ స్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సీతారామ చంద్రుల అనుగ్రహం కోసం భక్తులు అఖండ రామనామ సంకీర్తనలో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అమ్మవారి ఆలయాల్లో ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

**నారాయణవనం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



మండలంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిద రోజు ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకొని అమ్మవార్లు వివిధ రకాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అం౯్యంకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాధకోనలో వెలసిన కామాక్షాంభిగా అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఉదయం దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత అభిషేకం చేశారు. అనంతరం అమ్మ వారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు సముదాయం వెలసిన టిటిడి ఆలయం అవనాక్షమ్మ అమ్మవారు ధనలక్ష్మీ అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నారాయణవనం ద్రౌపతీదేవి అమ్మవారు మహిశాసూర మర్ధిని అలంకరణలో, నారాయణవనం క్రాస్‌లో వెలసిన అవనాక్షమ్మ ఆలయంలోను అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సూపరింటెం డెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు వెంకట శివ ప్రసాద్, షరాబు భరత్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహాగౌరి అలంకరణలో అష్టమ దుర్గ

## శ్రీకమలాత్మిక దేవి అలంకరణలో శ్రీమరకతశక్తికాళి

**రామచంద్రాపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో ఆదివారం శ్రీకమలాత్మిక దేవి అలంకరణలో శ్రీమరకతశక్తికాళి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి ఆధ్వర్యంలో మంత్ర మహేశ్వరి రమ్యానందభారతి అమ్మవారికి విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో విశేష అలంకరణ గావించి, హోమాలు, పూర్ణాహుతి సమర్పించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్త్రీమూర్తులకు సువాసినీ పూజ నిర్వహించారు. 8 ఏళ్ళ లోపు చిన్నారులకు జగద్గురువుల సమక్షంలో రమ్యానంద భారతి బాలపూజ నిర్వహించారు. సాయంత్రం కళాకారులచే నిర్వహించిన గానకచ్చేరి భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో దేశవిదేశాల నుండి హాజరైన భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

వార్త | తిరుపతి, చిత్తూరు జిల్లాలు ♦ సోమవారం 19 అక్టోబర్ 2026 

# కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసింది



## – పెద్ద ఉద్యమం చేస్తాం
## – ప్రజాస్వామ్యం పేరుతో నాటకాలు ఎందుకు?

తిరుపతి హెల్త్, అక్టోబర్ 18, ప్రభాతవార్త

స్థానిక సంస్థ ఎన్నికలలో 58వ వార్డు అభ్యర్థి రాధా, 48వ వార్డు అభ్యర్థి ఎం శ్రీనివాసులు, 9వ వార్డు అభ్యర్థులు, 39వ వార్డు వి కుసుమ, సిపిఐ పార్టీ తరపున పి మురళి, సిపిఎం పార్టీ తరపున టి సుబ్రమణ్యం మేయర్ అభ్యర్థులుగా నామినేషన్ వేయడం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగరాజు మాట్లాడుతూ మహిళలని కూడా చూడకుండా మహిళల చేతిలో నామినేషన్ పత్రాలను లాక్కొని కూటమి ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వములో చిన్న పెద్ద మహిళలు అనే తేడా లేకుండా గంజాయి బ్యాచ్, రౌడీషీటర్స్ వీరా విహారం చేశారని, ఇది ఎన్నికల నామినేషన్ పక్రియలో స్పష్టంగా కనపడిందని అన్నారు. గత ప్రభుత్వ వైసిపి హయాంలో జరిగిన దానికంటే కూటమి ప్రభుత్వంలో ఇంకా దారుణంగా ప్రవర్తించారని, రాబోయే రోజులలో ప్రజాసంఘాలను తిరుపతిలో ఉన్న ప్రముఖులను కలుపుకొని పెద్ద ఉద్యమం చేస్తామని నాగరాజు హెచ్చరించారు. సిపిఐ మురళి మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షాన్ని కూడా నామినేషన్ వేయకుండా అడ్డుకొని, మహిళల అనే గౌరవం లేకుండా దాడులు చేసి, కొట్టి తరిమేయడం ఎంతవరకు సమంజసం అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి అన్యాయాలు, అక్రమాలు ఎల్లా కాలం సాగదన్నారు. వామపక్షాలను గెలిపించడం ద్వారా కూటమీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పిన వాళ్ళవుతారని తిరుపతి ప్రజలందరూ వామపక్షాలు పోటీ చేసిన అభ్యర్థులకు మాత్రమే ఓటు వేసి గెలిపించి తద్వారా ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా పి అంజయ్య మాట్లాడుతూ గతంలో వైసీపీ వాళ్లు చేసిన అరాచకాలు మీరు చేస్తే వాళ్లకు మీకు తేడా ఏముందని, ఆనాడు వాళ్ల చేసిన అరాచకాల వల్లనే వాళ్లకు ప్రజలు బుద్ధి చెప్పి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా మూలన కూర్చోబెట్టారన్నారు. సిపిఐ సిపిఎం కార్పొరేటర్లుగా 1వ వార్డు నుండి ఆరవ వార్డు వరకు మరోసారి నామినేషన్లు చేయడానికి అవకాశం కల్పించాలని, 57 58 59 వార్డులు, బైరాగి పట్టెడ్లోని 10, 11, 12 డివిజన్లో నూ, ఆరవ వార్డు 5వ వార్డులలో బార్కెట్లను తోసి తన్నుకుంటూ దౌర్జన్యం చేశారని, రిటర్నింగ్ అధికారులకూడా రక్షణ లేకుండా పోయిందని, ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతిలో స్థానిక సంస్థల ఎన్నికలలో 66 వార్డులలో మీకు నచ్చిన వారి పేర్లను మీరు అనౌన్స్ చేసుకోవచ్చని, ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యం పేరుతో దొంగ నాటకాలు ఎందుకని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏమాత్రం సిగ్గు శరం లేకుండా మహిళలనే గౌరవం కూడా లేకుండా ప్రవర్తించారని వేదన వ్యక్తం చేశారు. రాధా నామినేషన్ లాక్కొని వెళ్లి తమని సుమారు 200 మంది చుట్టేసారని, పోలీసు అధికారులకు, కలెక్టర్‌కి, ఫోన్ చేసిన, ఎస్ఎంఎస్ చేసిన స్పందించలేదని, మా పరిధి 100 మీటర్ల లోపు మాత్రమే అని, ఆ తర్వాత మాకు సంబంధం లేదని పోలీసులు చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ సమావేశంలో సీపిఐ పార్టీ నాయకులు రాధాకృష్ణ, విశ్వనాథం, చంద్రశేఖర్ రెడ్డి, పీపిఎం పార్టీ నాయకులు టి. సుబ్రమణ్యం, రాధా, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## 100 ఏళ్ల రావి చెట్టు నరికివేసిన విద్యుత్ శాఖ

తొట్టంబేడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త



విద్యుత్ శాఖ నిర్వహణ పేరుతో పచ్చదనాన్ని కనుమరుగు చేస్తున్నారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వందేళ్ళ చెట్టును నరికటం పట్లవ్యతిరేకత వ్యక్తమౌతుంది. మండలంలోని పెద్దకన్నలి పంచాయతీలోని కొత్త కన్నలి గ్రామంలో విద్యుత్ లైన్ల ఏర్పాటు పేరుతో సుమారు వంద సంవత్సరాల వయసు ఉన్న మస్తానయ్య రావి చెట్టును నరికివేయడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్త కన్నలి గ్రామంలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఆ సమయంలో అధికారులు, కాంట్రాక్టర్ గ్రామస్తులతో ఎలాంటి చర్చ జరపకుండా వందేళ్ల నాటి రావి చెట్టును కొట్టివేసి, చెట్టు నడిమిధ్య నుంచి విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసినా కాంట్రాక్టర్ పట్టించుకోలేదని, విద్యుత్ మెయిన్‌టెనెన్స్ అధికారులు చెప్పారంటూ సమాధానం ఇచ్చారని చెబుతున్నారు. ఈ విషయంపై తొట్టంబేడు ఏఈని వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదంటూ సమాధానం ఇచ్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రావి చెట్టు గ్రామస్తులకు కేవలం ఒక చెట్టు మాత్రమే కాదు, వారి విశ్వాసానికి, ఆచారాలకు ప్రతీక. రావి చెట్టు వద్ద మస్తానయ్య దర్గా ఏర్పాటు చేసుకుని గ్రామస్తులు ఏటా గంధపోత్సవం (జెండా ఉత్సవం) ఘనంగా నిర్వహించేవారు. తరతరాలుగా ఎంతో అపురూపంగా రావి చెట్టును కాపాడుకుంటూ వస్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. అలాంటి వృక్షాన్ని అడ్డగోలుగా నరకడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా లైన్లు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. శతాబ్దపు చెట్టును తెగనరకటం దారుణమంటున్నారు.

## గణిత ఉపాధ్యాయునికి జాతీయ గుర్తింపు

### గుండేలిగుంట ఉపాధ్యాయుని ప్రతిభ

తొట్టంబేడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త



మండలంలోని గుండేలు గుంటలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న మునీశ్వరరెడ్డి తాను రూపొందించిన ప్రాజెక్టుకు జాతీయస్థాయి గుర్తింపు వచ్చింది, దాంతో మునీశ్వర్‌రెడ్డిని పలువురు అభినందించారు. గుండేలిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడుగా కె. మునీశ్వర రెడ్డి పని చేస్తున్నారు. ఆయన రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైంది. జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ), న్యూఢిల్లీ నిర్వహిస్తున్న విద్యలో సవాచార పద్ధతులు, ప్రయోగాల ప్రోత్సాహం కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎంపికైన 27 ప్రాజెక్టుల్లో ఇది ఒకటి కావడం విశేషం. బి.ఎన్. కండ్రిగ మండలం పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు రవి చేమూరుతో కలిసి మునీశ్వర రెడ్డి ఈ ప్రాజెక్టును రూపొందించారు. దేశవ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ విద్యా సంస్థల అధ్యాపకుల నుంచి ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదనలు ఆహ్వానించింది. ప్రాంతీయ విద్యా సంస్థ (మైసూరు), ఎన్‌సీఈఆర్‌టీ స్థాయిల్లో రెండు దశల కఠినమైన మూల్యాంకనం తర్వాత దేశవ్యాప్తంగా కేవలం 27 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపిక కాగా, తిరుపతి జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ప్రాజెక్టు ఇదే కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

### అసలు ప్రాజెక్టు ఏంటి?..

ఎన్‌సీఈఆర్‌టీ కొత్తగా ప్రవేశపెట్టిన ఖగణిత ప్రకాశ్ పాఠ్యపుస్తకాలు రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరమే 6, 7, 8 తరగతులకు అమల్లోకి వచ్చాయి. ఈ పుస్తకాల్లో సంఖ్యా భావనలు తరగతి నుంచి తరగతికి సర్పిలాకారంగా విస్తరిస్తాయి. ఆ విస్తరణలో విద్యార్థులు ఎక్కడ తడబడుతున్నారో గుర్తించి, ఇంటర్నెట్ అవసరం లేకుండా పనిచేసే తెలుగుఇంగ్లీషు ద్విభాషా డిజిటల్ ఉపకరణాల ద్వారా ఆ అంతరాలను పూరించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లపైనా, సాధారణ మొబైల్ ఫోన్లపైనా ఇవి పనిచేస్తాయి. అంటే ఇంటర్నెట్ లేని మారుమూల గ్రామాల్లో కూడా విద్యార్థులు సులభంగా గణితం నేర్చుకోవచ్చు. ఇదే ఈ ప్రాజెక్టు ప్రత్యేకత.

### నవంబర్ నుంచి అమలు..

నవంబర్ నుంచి మార్చి వరకు ఐదు నెలల పాటు రెండు పాఠశాలల్లో ఈ ప్రాజెక్టు అమలవుతుంది. అమలు సమయంలో ఎన్‌సీఈఆర్‌టీ అధ్యాపకులు పాఠశాలలను సందర్శించి పరిశీలిస్తారు. మార్చి 31 లోగా తుది నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం 2027 మేజూన్‌లో ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించే జాతీయ సదస్సులో మునీశ్వర రెడ్డి తమ ప్రాజెక్టును ప్రదర్శిస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైనందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ముని తిరుమలయ్య, తోటి ఉపాధ్యాయులు మునీశ్వర రెడ్డిని అభినందించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు జాతీయ స్థాయికి ఎదగడం అందరికీ స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

## సంఘాన్ని బలోపేతం చేయాలి
## కార్యక్రమాలకు విస్తృత ప్రచారం జరపాలి

జంగమ సంక్షేమ సంఘం సమావేశం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి జంగమ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక సంతమైదానంలోని గురుమందిరంలో జరిగింది. సమావేశంలో సంఘాన్ని బలోపేతం చేయుటకు పలు అంశాలను సమావేశంలో చర్చించారు. ఇక సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సామాజిక కార్యక్రమాల నిర్వహణ పట్ల చొరవ చూపాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. కమిటీలోకి కొత్తగా ఒకరిని సహ కార్యదర్శిగా, ముగ్గురిని కమిటీ సభ్యులుగా నియమించుకోవాలని నిర్ణయించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రానున్న కార్తీక మాసంలో వనభోజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. సంఘ సభ్యులందరూ కుటుంబ సమేతంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని చర్చించారు.

### మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉభయం:..

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 2027 లో జంగమ సంక్షేమ సంఘం, శ్రీకాళహస్తి తరపున ఉభయం నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ఈ సందర్భంగా సభ్యులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి మత్స్యకార సదస్సు విజయవంతం చేయండి

మత్స్యకారుల సంఘ సమావేశం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మత్స్యకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని సమితి అధ్యక్షుడు పిలుపు నిచ్చారు. ఆదివారం జరిగిన సమావేశంలో మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షుడు గంగపుత్ర గాంధీ మాట్లాడుతూ ఈనెల 28, 29వ తేదీల్లో గంగా సదన్ నందు జరుగు రాష్ట్ర స్థాయి మత్స్యకార సంక్షేమ సమితి సదస్సుకు సభ్యులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. శ్రీ కావమ్మ గుడి శ్రీరామ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి సదస్సు విజయవంతం కావాలంటే ప్రతి మత్స్యకార కుటుంబం భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బి సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోటకొండ గోపాలరాజు, శ్రీకాళహస్తి అధ్యక్షుడు మన్నేపల్లి శ్రీనివాసులు గంగపుత్ర గాంధీని శాలువాతో సన్మానించారు. బి.సి. కులాల ఐక్యత చాటాలని ఈ సందర్భంగా వారు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో గరిగపాటి రమేష్ బాబు, మొగరాల గణేష్ పాల్గొని సత్కరించారు. అలాగే మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు నెల్లూరు కన్నయ్య, బెట్టిం వెంకటేశ్వర్లు, మాదాసు నాగార్జున, కాట్రపల్లి బాలకృష్ణ, మోహన కృష్ణ, తుళ్ళిపూడి ధనంజేయులు, మిఠాయి మురళి, సుధాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో మత్స్యకారుల సమస్యలు, సంక్షేమ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు గాంధీ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## బ్రహ్మకుమారి సమాజంచే నవరాత్రి ఉత్సవాల సంబరాలు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి బ్రహ్మకుమారి సమాజం సారథ్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాల సంబరాలను నిర్వహించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో విస్తృతమౌతున్న ఎస్‌డికె నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సమాజం భవనంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాలను పరిశీలించిన ఆయన దీపాన్ని వెలిగిస్తూ ఈ భాగ్యాన్ని కల్పించిన సిస్టర్లను అభినందించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వవెంకటేశ్వరస్వామి దర్శనం మహాభాగ్యమన్నారు. శ్రావణ మాసంలో ఐదవ, శనివారం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగదైవం వెంకటేశ్వరుని శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులు దర్శించుకునేటట్లు ఏర్పాటు చేయటం వారిలోని భక్తి భావానికి నిదర్శనం అన్నారు. 12జ్యోతిర్లింగాలను దర్శించాలంటే ఎంతో వ్యవప్రయాసాలతో కూడుకున్నది అలాంటి బ్రహ్మకుమారి సమాజం ప్రతి ఏ డాది భక్తులకు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కల్పించటం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు వల్లం గోపి, ప్రసాద్, షాజహాన్ ఈశ్వరీయ బ్రహ్మకుమారి సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్ కుటుంబసభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే పూజలను జరుపుకున్నారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న దసరా సంబరాలు బొమ్మల కొలువులో అమ్మవారి అలంకారాన్ని చూసి భక్తితో మోకరిల్లారు. ఏర్పాట్లను ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.

## సొంత సంపాదనలో కొంత పేదలకు కేటాయింపు

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు




శ్రీకాళహస్తి అక్టోబర్ 18 ప్రభాతవార్త

తాము సంపాదించిన సంపాదనలో కొంత పేదలకు ఇవ్వాలని ఇస్లాం మతం చెబుతుంది. అలాగే ఈ మొత్తాన్ని జకాత్‌రూపంలో పేదలను ఆదుకోవటానికి అందించాలని సూచిస్తుంది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తిలోని ఓ చిరువ్యాపారి తన సంపాదనలో కొంత దివ్యాంగులకు అందిస్తున్నారు. ఒటి రెండు కాదు 178 నెలలు సుమారు 15 సంవత్సరాలుగా ఆగకుండా తగ్గకుండా ఆదుకుంటున్నారు. శ్రీకాళహస్తిలోని నగరి వీధిలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో పేదలు, దివ్యాంగులు ఆకలితో బాధపడకూడదనే సంకల్పంతో ప్రతి నెల నిత్యవసర సరుకులను అందజేస్తూ ఆదుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సంస్థ అధినేత మునీర్‌బాషా సరుకులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మునీర్ బాషా మాట్లాడుతూ భగవంతుడు ఇచ్చిన స్తోమతలో సహాయం చేయడమే నిజమైన ధర్మం అని అన్నారు. డబ్బున్న వారందరూ సేవ చేయలేరు, సేవ చేయాలనే మనస్సున వారే నిజమైన ధనవంతులు అని ఆయన అన్నారు. అదే విధంగా దివ్యాంగులకోసం తమ సొంత కాళ్ళ పై నిలబడేలా వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించే నూతన కార్యక్రమానికి త్వరలోనే శ్రీకారం చుడుతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు అందించే సహాయంను అందించారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాది రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, కోళ్ళూరు హరినాథ్ నాయుడు, బాబాపరీథ్, సుధాల్యాబ్ హాబీబ్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధం కావాలని సిపిఐ పిలుపు




శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో శ్రీకాళహస్తి రూరల్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలో పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత సిపిఐ పార్టీకే ఉందని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న పార్టీ సిపిఐ అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీ చేసే అభ్యర్థులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. మండలంలో సిపిఐ పార్టీతో కలిసి వచ్చే పార్టీలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి మించిల శివ కుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లికార్జున్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ముని చందు, మండల నాయకులు మనీ, రాజయ్య, దేవా మరియు మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

భారత రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను జగన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ అరాచక శక్తులు భౌతిక దాడులతో రక్తసిక్తం చేసి, ప్రజలను భయపెట్టి విజయం దక్కించుకోవడం కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి మరియు తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం. ఉమేష్ రావు ఆరోపించారు. పుంగనూరు, తిరుపతి, రాయచోటి వంటి ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి, భౌతిక దాడులకు పాల్పడి, రక్తపు మరకలు అంటించుకొని తామే బాధితులమంటూ ప్రభుత్వంపై బురదజల్లుతూ మొసలి కన్నీరు కార్చడం వైసీపీ అధినేత జగన్ రెడ్డికి పరిపాటిగా మారిందని, ఆయన తీరు చూస్తే దొంగే దొంగా అని అరిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనీయకుండా చేయడం ద్వారా రాష్ట్రానికి అందవలసిన నిధులు, గ్రాంట్లు రానీయకుండా చేసి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవాలనే దుర్బుద్ధితో ఎలాగైనా ఎన్నికలను అడ్డుకోవాలని జగన్ రెడ్డి, మిథున్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అవినాష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు బెంగళూరు ప్యాలెస్ లో కూర్చుని కుట్రలు చేశారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి రౌడీలను, అల్లరి మూకలను తీసుకొచ్చి, ప్రశాంతంగా ఉండే ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించి, రాష్ట్ర వ్యాప్తంగా గొడవలు జరుగుతున్నాయనే అపోహలను ప్రజలలో సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి నామినేషన్ సెంటర్ల వద్ద భూమన అభినయ్ చేసిన రౌడీ చేష్టలు, బెదిరింపులే దీనికి నిదర్శనమని, అలాగే రాజంపేటలో అమర్‌నాథ్ రెడ్డి చేసిన అరాచకం రాష్ట్ర ప్రజలంతా గమనించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు, తంగేళ్ళపాలెం పిఏసిఎస్ చైర్మన్ బీమాల భాస్కర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, తిరుపతి పార్లమెంటు నాయకులు గాజుల భగత్ రాయల్, పూల శేఖర్, పసుపులేటి శంకరయ్య, గంగనపల్లి రమేష్, సులేమాన్, బిజెపి నాయకుడు గోపీ తదితరులు పాల్గొన్నారు.

19 CTR6:19 CTR6.qxd 10/18/2026 11:12 PM Page 1



# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నగారా!

## 21 నుంచి నామినేషన్లు.. నవంబర్ 3న పోలింగ్.. 5న ఫలితాలు!
## - అభ్యర్థులకు కీలక ఘట్టం.. ప్రచారానికి తెరలేపనున్న రాజకీయ పార్టీలు
## - నామినేషన్ల నుంచి ఓట్ల లెక్కింపు వరకు నిర్దిష్ట కాలపట్టిక

తిరుపతి రూరల్ అక్టోబర్ 18 ప్రభాతవార్త :

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాజకీయ సమీకరణాలు వేగం పుంజుకోనున్నాయి. పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు నామినేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కానుండగా, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రాజకీయ వాతావరణం వేడెక్కనుంది. అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా, నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపుతో ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరనుంది.

తిరుపతి రూరల్ ఎన్నికల షెడ్యూల్ ఇదీ..

అక్టోబర్ 21-23: పోటీ చేయదలచిన అభ్యర్థుల నుంచి ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.

అక్టోబర్ 24: దాఖలైన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు.

అక్టోబర్ 25: నామినేషన్ల తిరస్కరణపై అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు.

అక్టోబర్ 26: తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లకు సంబంధించి ఎన్నికల అధికారి తుది నిర్ణయం తీసుకుంటారు.

అక్టోబర్ 27: అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంటుంది. అదే రోజు సాయంత్రం పోటీలో నిలిచే ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారి నోటీసు బోర్డులో ప్రకటిస్తారు.

నవంబర్ 3: ఓటింగ్ నిర్వహిస్తారు.

నవంబర్ 4: అవసరమైన చోట ఎన్నికల అధికారి అనుమతితో రీపోలింగ్ నిర్వహిస్తారు.

నవంబర్ 5: ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. విజేతలకు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

### అభ్యర్థులు అప్రమత్తం కావాల్సిన సమయం!

నామినేషన్ల దాఖలుకు కేవలం మూడు రోజులే గడువు ఉండటంతో అభ్యర్థులు అవసరమైన పత్రాలు, నిబంధనలు ముందుగానే సిద్ధం చేసుకోవడం కీలకం. నామినేషన్ పత్రాల్లో పొరపాట్లు, ధ్రువపత్రాల లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది..

# ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి
## - ఎస్పీ తుషార్ డూడి



చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మూడు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల దాఖలు ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడానికి పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందన్నారు. నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రతి ఒక్కరు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, ఎలాంటి పుకార్లు నమ్మవద్దని, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం చేయవద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమస్యలు, అనుమానాస్పద కార్యక్రలాపాలు గుర్తించినట్లైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు శాఖ పూర్తి అప్రమత్తతో విధులు నిర్వహిస్తోందన్నారు.

# రిజర్వేషన్లు తేలాయి
# కూటమి సర్దుబాట్లు జరగాల్సి ఉంది
## నేడు కూటమి పార్టీల సమావేశం?!

శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి చోటు చేసుకుంది. మొదటి విడతలో ఎంపిటిసిలు.జడ్పిటిసిల ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో కూటమినిలోని తెలుగుదేశం, జనసేన, బిజెపిలు సీట్ల సర్దుబాట్లతో ఎన్నికలకు వెళ్ళాల్సి ఉంది. అయితే ప్రతిపక్ష వైకాపా మాత్రం సింగిల్‌గా తన అభ్యర్థులను రంగంలో దించనుంది. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి సమావేశం బహుశా సోమవారం జరగవచ్చునని భావిస్తున్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మెన్ కుర్చి జనసేన మద్దతుదారునికి అని విస్తృత స్థాయిలో ప్రచారం జరిగింది, చివరి నిముషంలో మారింది. ఇక ఎవరెవరు ఏ సీట్లలో పోటీ చేయాలనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇందుకు కూటమి సమావేశం జరగాల్సి ఉంది.ఈ సమావేశం సోమవారం జరగవచ్చుననే ఊహాగానాలు సాగుతున్నాయి.

### 30శాతం ఎంపిటిసిలు కోరనున్న జనసేన:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి పార్టీల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపిలున్నాయి. ఈ మూడు పార్టీల సమన్వయ సమావేశం జరగాల్సి ఉంది. బహుశా ఈ సమావేశం సోమవారం జరగవచ్చునని భావిస్తున్నారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ తమ తామాషా ప్రకారం 30శాతం సీట్లు కోరనున్నట్లు సమాచారం. అంటే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొత్తం 64 ఎంపిటిసి స్థానాలు, నాలుగు జడ్పిలు, నాలుగు మండలాధ్యక్షులు పదవులున్నాయి.ఇందులో జనసేన 20 ఎంపిటిసిలు,ఒకజడ్పిటిసి, ఒక మండలాధ్యక్ష పదవిని కోరనున్నట్లు చర్చించుకుంటున్నారు.ఈ నేపథ్యంలో వారు ఏ ఏ స్థానాలు కోరుకుంటారో అనే ఉత్కంఠత చోటు చేసుకుంది. ఇప్పటికే దేశంలో ఎంపిటిసిలు,జడ్పిటిసిలు మండలాధ్యక్ష పదవి ఆశిస్తున్న వారు ఎంఎల్‌ఏ పై వత్తిడి తెస్తున్నారు. కూటమి సమావేశం జరిగిన తరువాత మిత్రపక్షాలు ఏ స్థానాలు కోరుతారో? అక్కడ తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏమిటో వేచి చూడాలి. ఇక బిజెపికి కూడా కొన్ని సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. వారు ఏవి కోరుకుంటారో చూడాలి అంటే సుమారు 33శాతం సీట్లు అంటే నాలుగు మండలాల్లో ఉన్న 64 ఎంపిటిసి స్థానాల్లో 16 మిత్రపక్షాలకు కేటాయించాల్సి ఉంది.మరి సీట్ల కేటాయింపుల్లో ఎంఎల్‌ఏ ఎంతో చాకచక్యంగా వ్యవహారించాల్సి ఉంది.ఒక వేళ తెలుగుదేశంకు ఆది నుంచి మద్దతుగా ఉన్న స్థానాలను కోరుకుంటే వారిని ఒప్పించాలి మెప్పించాల్సి ఉంది. ఇప్పటికే మండలాధ్యక్ష పదవులను ఆశిస్తున్న తెలుగుదేశం నాయకులు ఎంఎల్‌ఏ పై వత్తిడి తెస్తున్నారు. మండలాధ్యక్ష పదవిలో ఏర్పేడు మండలాన్ని తమకు కేటాయించమని జనసేన కోరనున్నట్లు సమాచారం. ఈ మండలాధ్యక్షపదవిని బిసి మహిళలకు కేటాయించారు.ఈ మండలంలో జనసేన పార్టీకి ఆది నుంచి పాటుపడుతున్న కిరణ్ కుమార్ కోరనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఈ పదవిపై తెలుగుదేశంలో ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం.

### బిజెపి ఏమి కోరుకుంటుంది?

ఇక బిజెపి ఏమి కోరుకుంటుందనేది మరో చర్చ జరుగుతుంది. ఈ పార్టీలో రాజకీయ అవగాహన కల్గిన నాయకుని సారథ్యంలో సాగుతుంది. ఎన్నికలంటే ఆషామాషి కాదని మంది మార్బాలంతో పాటు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది కాబట్టి ఆచి తూచి అడుగులేయాల్సి ఉంటుందని భావించి తెలుగుదేశం ఏదీ కేటాయిస్తే అది చాలన్నట్లు ఉన్నారు.అయితే మండలాధ్యక్షపదవి మాత్రం కోరనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తొట్టంబేడు మండలంలో బిజెపి పార్టీకి,కోలా ఆనంద్‌కుమార్‌కు ముఖ్యఅనుచరుడుగా ఉంటున్న కృష్ణయ్యను మండలాధ్యక్షుని చేయాలని ఎంఎల్‌ఏను కోరనున్నట్లు సమాచారం. మరి ఎవరికి ఏమి దక్కుతుందో? సోమవారం తేలనుంది.

# మేయర్ కుర్చీకి 14 నామినేషన్లు
## 60 కార్పొరేటర్ స్థానాలకు 606 నామినేషన్లు

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :

చిత్తూరు మేయర్ కుర్చీకి నామినేషన్ల దాఖలు రోజైనా ఆదివారం నాటికి మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండగా కార్పొరేటర్లుగా పోటీ చేయడానికి 606 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చిత్తూరు మేయర్ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున ఆరు మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మేయర్గా పోటీ చేయడానికి 3 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున ఒకరు, స్వతంత్ర అభ్యర్థులుగా నలుగురు మేయర్ పదవి కోసం నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండగా తెలుగుదేశం పార్టీ తరఫున అత్యధికంగా 271 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 177 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనసేన పార్టీ తరఫున 37 మంది అభ్యర్థులు, బిజెపి తరఫున 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరఫున 1, కాంగ్రెస్ నుండి 1, యువ జనతాదళ్ ( సెక్యులర్ ) 2, సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున 4, స్వాతంత్ర అభ్యర్థులుగా 94 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

# వాసవి అమ్మవారి సేవలో పవిత్రమ్మ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కిటకిటలాడుతున్నాయి. ఆదివారం రాత్రి బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెలసిన అమ్మవారిని పవిత్రారెడ్డి దర్శించుకున్నారు. ఆమెతో పాటు కాటంరెడ్డి కౌసిక్ రెడ్డి వున్నారు. పవిత్రారెడ్డి భవానిమాల ధరించి రాగా, ఆలయం వద్ద చైర్మన్ జూలుగంటి మురళి, సురేంద్రబాబు సారథ్యంలో సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆమెతో పాటు మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణకుమార్, పఠాన్ ఫరీద్, ఆశా కిరణ్, మోహన్, భాను, రాజారాయల్, మానస తదితరులు వున్నారు.

# 'దేశం' మేయర్ అభ్యర్థి
# కఠారి హేమలత నామినేషన్ దాఖలు



భారీ ప్రదర్శనతో నామినేషన్ దాఖలుకు వస్తున్న తెలుగుదేశం మేయర్ అభ్యర్థి కఠారి హేమలత.

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:

తెలుగుదేశం మేయర్ అభ్యర్థి కఠారి హేమలత ఆదివారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, కాజూరు బాలాజీలతో కలిసి నామినేషన్ దాఖలు చేసింది. మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో ఎలాంటి విబేధాలు లేవని ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కఠారి హేమలత ప్రజలకు చాటి చెప్పారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి భారీ ప్రదర్శనతో మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కఠారి హేమలత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంకు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, తెలుగుదేశం నాయకులు చంద్రప్రకాష్, కాజూరు బాలాజీలు, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మాజీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కూటమి పార్టీల నాయకులు మేయర్ అభ్యర్థి కఠారి హేమలతకు మద్దతు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల
# నిర్వహణకు పరుగులు




శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మున్సిపల్ కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి సిబ్బందితో పరుగులు తీయిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల నగరా మ్రోగినా శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఎన్నికలు నిర్వహణ వాయిదా పడింది. డిలిమిటేషన్ సక్రమంగా చేపట్టలేదని 23 మున్సిపాలిటీలకు మొదటి దశ నందు ఎన్నికలు నిర్వహణ సాధ్యం కాలేదు. ఆదివారం నాటికి మొదటి దశ నామినేషన్ల పర్వం పూర్తికావడం, సుప్రీం కోర్టు కూడా ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రెండవ దశ నందు మున్సిపాలిటీలకు నిర్వహించే ఎన్నికల మీదనే అందరి కన్నుపడింది. డిలిమిటేషన్ ప్రక్రియ పూర్తికావడంతో ఓటర్ల జాబితాకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ మేరకు 01.01.2026నాటికి వున్న మొత్తం ఓటర్లు 72,447తో ఎన్నికలు చేపట్టనున్నట్లు కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 24న ఓటర్ల లిస్టు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎటువంటి సమయంలో నైనా నోటిఫికేషన్ విడుదల కావచ్చునని, ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ పూర్తయిన వెంటనే మున్సిపల్ నోటిఫికేషన్ విడుదల అవుతుందని ఉన్నతాధికారులు సంకేతాలు అందించడం, డిలిమిటేషన్ ద్వారా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

### పంచాయితీలకు ముందే మున్సిపల్ ఎన్నికలు?

వివిధ కారణాలతో ఎన్నికలకు దూరంగా వున్న శ్రీకాళహస్తి మునన్సిపాలిటీ సంబంధించిన అవరోధాలు తొలిగాయి. రెండవ దశలో మున్సిపల్ ఎనన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. నవంబర్ మాసంలోనే శ్రీకాళహస్తి మునన్సిపల్ ఎన్నికలు ఎనిర్వహించుటకు ఉన్నతాధికారులు సంకేతాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే స్థానిక అధికారులు రేయింబవళ్ళు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహించుటకు మున్సిపల్ అధికారులు సమాయత్తమౌతున్నారు. బహుశా ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల తరువాత రాష్ట్రంలోని 23 మున్సిపాలిటీల్లో శ్రీకాళహస్తి వుండడంతో ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

# తెదేపాలోకి 36 మైనార్టీ కుటుంబాలు చేరిక




కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 36 మైనార్టీ కుటుంబాలు ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం స్థానిక తెదేపా కార్యాలయంలో జరిగింది ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ,పీకే ఎం ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్ కుమార్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రాజ్ కుమార్ ,మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ సర్పంచ్ గోపీనాథ్, యువనేత హర్ష ధర్మతేజ , కాషిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగంటి ప్రయత్నంతో
# అగ్రహారం పరిహారం మంజూరు

రైల్వే కోడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త

రెండున్నర దశబ్దాలుగా బాధితులు ఎదురు చూస్తున్న అగ్రహారం డైంజర్ జోన్ పరిహారం ఎట్టకేలకు మంజూరైనట్లు తెలుస్తుంది. ఈ పరిహారం మంజూరు కు గ్రామ ఆదినాయకుడైన ఓరుగంటి నవీన్ కృషి ఫలితమే అని గ్రామస్థులు చెప్పుకోడం విశేషం. సాదారణంగా అగ్రహారం అనగానే బ్రాహ్మణులు ఉండే గ్రామం. అలానే ప్రపంచంలో ప్రఖ్యాతి గాంచిన ముగ్గురాళ్ళ గనులున్న ప్రాంతమే అగ్రహారం.అప్పట్లో ఈ ప్రాంతాన్ని మట్లి రాజులు, పరిపాలించారని చెప్పుకుంటారు. అప్పట్లో ఈ ప్రాంతములో మంగమ్మ అనే ఆమె బ్రాహ్మణ మహిళ ఉండేదని అందుకు దీనిని మంగమ్మ పేట అని పిలిచేవారని ఇది రాను రాను మంగంపేటగా రూపాంతరం చెందిందంటారు. మట్లి రాజుల పాలనలో మంగమ్మ ఉంటే మంగంపేటగా రూపాంతరం చెందిన ఓరుగంటి రామలింగయ్య పేరు వినపడేది. స్వాతంత్ర్యము రాక ముందునుంచి గత 30ఏళ్ల క్రితం వరకు మంగంపేట అనగానే రామలింగయ్య స్వామి ఊరా అనే వారు ఈ యన అప్పట్లో కరణంగా పని చేసేవారు. ఈయన హయాంలో అనేకమంది పేదలను పోషిస్తూ వందలాది పాడి పశువులైన ఆవులను కూడా పోషింప జేసేవారని చెబుతున్నారు. వీటి కోసం 120 ఎకరాలు పశువుల మేతకు భూమిని కూడా కేటాయించారు. అప్పటి ఆయన పోషిస్తున్న వందలాది ఆవులు వాటి సంతతి నేటికి పదుల సంఖ్యలో ఉన్నాయి. వీటి మేత కోసం కేటాయించిన నూటా ఇరవై ఎకరాలు పశువుల మేత భూమి మైనింగ్ కోసం మట్టి కింద పడింది. ఉన్న అరా కోరా పశువులు మేత స్థలం దేవుడెరుగు కనీసం అవి తల దాసుకొనేందుకు జానడు స్థలం లేక బసు రోడ్లపై జీవిస్తూ అనేక రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యు వాత పడుతున్నాయి. ఇదే కాకుండా పంచాయతీ గ్రామ భవిష్యత్తు అభివృద్ధి కోసం వందల ఎకరాల మెట్ట భూములను కూడా నిల్వ యుంచి పెట్టారు. ఆయన ఒక పర్యాయం పంచాయతీ సర్పంచ్‌గా కూడా పనిచేసి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి ప్రజలను కాపాడుకొంటూ వచ్చారు. అయితే ఆయన పోయిన కొంత కాలానికి అక్రమ మైనింగ్ లా పేరుతో కొన్ని భూములు, అక్రమార్కుల చేతులోకి కొన్ని భూములు వెళ్లి పోయి మెట్టభూములు మాన్యాలు లేని మంగంపేట అయ్యింది. ఇదొక ఎత్తయితే చివరకు బ్రాహ్మణులు నివశించే అసలు గ్రామ మైన అగ్రహారంనే లేపేందుకు ముగ్గురాయి మేలేసి ఏసురు పెట్టారు. ఇక సేసేదేమి లేక దేవుడా అంటూ గ్రామాన్ని వదలి ప్రభుత్వం వారు తొలగించిన ప్రదేశానికి మండలాన్ని పంచాయతీని పక్క మండలంలోని వేరే పంచాయతీ లోకి వచ్చి చేరారు.ఈ తరలింపుతో అగ్రహారం అన్ని పోగొట్టు కుంటే అందులో నివశిస్తున్న బ్రాహ్మణులు చెల్లా చెదురుగా పోయారు. అందరు పోయిన ఓరుగంటి నవీన్ చిన్న వయసులో ఉన్న అగ్రహారం గ్రామాన్ని వదలకుండా అభివృద్ధి కోసం అందర్నీ పట్టుకొని అహర్నిశలు కష్ట పడ్డాడు. అప్పట్లో గ్రామాన్ని తరలించి భూములు తీసుకొని కనీసం కాసింత పరిహారం ఇచ్చేందుకు అటు ప్రభుత్వం, ఇటు కార్పొరేషన్ పెట్టిన కష్టాలు అంతా ఇంతా కాదు అలాంటి పరిస్థితులో నవీన్ పడ్డ కష్టం ప్రాయాస చెప్పలేనిది. ఆ అరా కోరా నష్ట పరిహారం పదేళ్ల పాటు తిరిగి తెచ్చుకుంటే గ్రాస్థులు కొత్తగా ఇళ్ళు నిర్మించుకొని ఉండే సమయంలో గనుల విస్తరణ గ్రామం అంచుకు వచ్చింది. ఇక చూసుకో గ్రామస్థులకు వారు పెట్టే డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ పిల్చే బాంబులు బాధలు అంతా ఇంతా కాదు పగటి పూట కూలి పనులకు వెళ్లకుంటే పూట గడవదు అలావెళితే బ్లాస్టింగ్ శబ్దలకు పిల్లలు భయపడతారు. అలా అని రాత్రులో నిద్ర లేదు అలాగని ఎన్ని ఏళ్ళు కంటి మీద కునుకు లేకుండా బ్రతికిన చివరకు బ్లాస్టింగ్ అదుర్లుకు ఇళ్ళు కూలి అనేకమంది పిల్లలు పెద్దలు ప్రాణాలు కోల్పోక తప్పలేదు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటూ ఎన్నో దఫాలు బతిమలాడితే అన్ని భూములు ఇళ్ళు అనేక స్థిర చారాస్థులు వదిలి మైనింగ్ అభివృద్ధి కోసం పాటుపడితే గ్రామాని తరలించడం పరిహారం ఇవ్వడం లో వారు చేస్తున్న జాప్యం అత్యంత ఘోరం. ఇలాంటి పరిస్థితులోనూ నవీన్ గత పదహాయిదు ఏళ్లుగా కోర్టును ఆశ్రయించి పోరాడిన పోరాటప్రతిఫలం పరిహారం నేటికీ ఒక కొలిక్కి వచ్చినట్లుంది. రెండున్నర దశబ్దాలుగా ఆయన చేసిన పోరాటం అగ్రహారం పరిహారఅభివృద్ధి కి సోపానంగా మారింది. అగ్రహారం గ్రామం పట్ల ఆయన ఎల్లవేళలా ఉండి అహర్నిశలు పనిచేయడం మాగ్రామం ప్రజలు చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నామని గ్రామస్తులు చెప్పుకోవడం విశేషం.

# ఉచిత ప్రయాణం స్త్రీశక్తి బస్సులు మాకొద్దు.!
## చంద్రగిరి బస్టాండ్‌కు బస్సులు నడపండి..!
## రాత్రింబవళ్ళు బైపాస్ బాట పడుతున్న ఆర్టీసి
## చంద్రగిరి-తిరుపతి మధ్యన విచ్చలవిడిగా స్పీడ్ బ్రేకర్లు



చంద్రగిరి బైపాస్‌లో వెళుతున్న రెండు పుంగనూరు బస్సులు, ఇలా మరెన్నో.




బైపాస్ బడుతున్న పుంగనూరు పల్లెవెలుగు ఆర్టీసి బస్సు దిగుతున్న వృద్ధురాలు

చంద్రగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:

స్త్రీశక్తి బస్సులు మాకొద్దు బాబోయ్ అంటూ ప్రభుత్వ ఉద్యోగులు, నిత్యం వివిధ పనుల కోసం ప్రయాణించే ప్రయాణికులు, రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఏపిఎస్ఆర్‌టిసి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్" వ్యక్తిగతంగా తన పరిధిలోని డిపోలకు చెందిన బస్సులు ఏ రూట్‌కు ఎన్ని బస్సులు, అవి ఏ సమయంలో, ఏఏ మార్గాలలో నడుపుతున్నారనే విషయంపై ఆకస్మిక తనిఖీల ద్వారా లేదా ఆర్టీసి యంప్లాయ్స్ ఒకరిద్దరిని ఏర్పాటు చేసి తెలుసుకోవాలని టిక్కెట్ తీసుకునే ప్రయాణికులు కోరుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా బస్సులు బైపాస్‌లో వెళ్ళిపోతుండటంతో చాలీచాలని బస్సుల వలన ప్రతి బస్సు కిక్కిరిసిన ప్రయాణికులతో చంద్రగిరి బస్టాండ్‌లో ఆపలేని పరిస్థితి నెలకొంటున్నది. అదేవిధంగా కాణిపాకం, వేలూరు, కుప్పం, బెంగుళూరు, హోసూరు బస్సులను బైపాస్ మీదుగా కాకుండా చంద్రగిరి మీదుగా నడపగలిగితే చార్జీలు చెల్లించడానికి ప్రయాణికులు సిద్ధంగా వున్నారు. వాస్తవానికి ఉచిత ప్రయాణం అని ప్రభుత్వం ప్రకటించడంతో నిత్యం ప్రయాణిస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు, రోగులు ఉచిత మహిళలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణిస్తున్న వారిలో మహిళలు, యువతులు బైపాస్‌లో దిగడం వలన ఆటోలు లేక ఇంటికి చేరుకునేంత వరకు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బస్సు ఎక్కుతుండగానే కండక్టర్లు, డ్రైవర్లు తెలివిగా బైపాస్‌లో వెళతాం, చంద్రగిరిలోకి వెళ్ళదని చెబుతారు. దీంతో చేసేదిలేక ప్రయాణికులు బైపాస్‌లోనే దిగాల్సి వస్తున్నది. చిత్తూరు-తిరుపతి, తిరుపతి-చిత్తూరు మాత్రమే ఎక్స్‌ప్రెస్‌లు, ఆర్డినరీ సర్వీసులు ప్రవేశపెట్టి చంద్రగిరి మీదుగా నడపగలిగితే కలెక్షన్స్ సైతం బాగానే వుంటాయి. పుంగనూరు డిపో విషయాన్ని పరిశీలిస్తే .. ఆర్టీసి అధికారులు చెబుతున్న సమయం ప్రకారం బస్సులు నడపాలంటే కనీసం 30 బస్సులు అవసరమవుతాయి. అయితే 19 బస్సులు మాత్రమే నడుపుతున్నారు. ఇందులో 10 బస్సులు పుంగనూరులో, 9 బస్సులు తిరుపతిలో బయలుదేరుతాయని తెలిసింది. ఇవికాకుండా 5 ఎక్స్‌ప్రెస్‌లు ఇందులో స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నప్పటికీ ఈ బస్సులు చంద్రగిరిలోకి ప్రవేశించకనే బైపాస్ బాటపడుతున్నాయి. అదేవిధంగా పుంగనూరు డిపోకు చెందిన 8 బస్సులు కొన్ని ట్రిప్పులను తిరుమలకు నడుపుతున్నట్లు సమాచారం. ఈ 8 సర్వీసులు నామమాత్రపు కలెక్షన్లతో కేవలం కిలోమీటర్ల కోసమే నడుపుతున్నారనే ఆరోపణలు వున్నాయి. ఈ 8+5+19=32 బస్సులను చంద్రగిరి, కాలూరు, చెర్లోపల్లి, బాలాజీ కాలనీ, స్విమ్స్, రుయా ఆసుపత్రి, అలిపిరి మీదుగా బస్టాండ్‌కు నడపగలిగితే కలెక్షన్స్ పరంగానే కాకుండా ప్రయాణికులకు బస్సుల కొరత నివారించినట్లు కాగలదు. గత ఏడాది చంద్రగిరి-తిరుపతి మార్గంలో కాలూరు నుండి విచ్చలవిడిగా స్పీడ్‌బ్రేకర్లు వేయడంతో బస్సులు ఈ మార్గంలో నడిపేందుకు ఇష్టపడని "ఆర్టీసి డ్రైవర్లు, కండక్టర్లు" బైపాస్ బాట పడుతున్నారు. కేవలం తిరుపతి బస్టాండ్‌లో దింపితే తమ పనైపోతుందనుకునే ఆర్టీసి డ్రైవర్లకు బస్టాండ్ నుండి ఆసుపత్రులకు వెళ్ళానుకునే రోగులకు ఆటో చార్జీలు భారమవుతాయని తెలియదా అంటున్నారు. స్త్రీశక్తి పథకం ప్రకటించిన కూటమి ప్రభుత్వం నిబంధనల మేరకు కేవలం సీటింగ్ కెపాసిటీకి మాత్రమే డబ్బులు చెల్లించడం పట్ల హైర్ బస్సుల నిర్వహకులు తమకు డీజిల్ ఖర్చులు భారంగా మారుతున్నట్లు వాపోతున్నారు. కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తుండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం తమకు ఇన్సూరెన్స్ సైతం లభించదని ఆందోళన చెందుతున్నారు. ఏపిఎస్ఆర్‌టిసి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ మా ఇబ్బందులపై దయతో అధ్యయనం చేసి ప్రభుత్వం ద్వారా తమను ఆదుకోవాలని లేదంటే తమ బస్సులను అర్థాంతరంగా అమ్ముకుని వెళ్ళిపోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.